క్లుప్తంగా

అంగన్‌వాడీలో గ్రాడ్యుయేషన్ డే



తుమ్మలపాలెం(ఇబ్రహీంపట్నం): స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు గ్రాడ్యుయేషన్ డే వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. అంగన్‌వాడీలో ఆటపాటలతో కూడిన విద్య అలవర్చుకున్న ఐదేళ్లు నిండిన చిన్నారులకు తల్లుల సమక్షంలో సర్టిఫికెట్లను అందజేశారు. ఎంపీపీ పాఠశాలలలో చేర్పించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఈలప్రోలు సెక్టార్ సూపర్‌వైజర్ రమాదేవి మాట్లాడుతూ మైలవరం ఐసీడీఎస్ సీడీపీఓ పుష్పలత ఆదేశాల మేరకు చిన్నారులకు గ్రాడ్యుయేషన్ డే నిర్వహించి విద్యార్థులను ప్రోత్సహిస్తున్నామన్నారు. ప్రీ స్కూల్‌లో జరిగే కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో పలువురు అంగన్‌వాడీలు, హెల్పర్లు పాల్గొన్నారు.

రేపు గురుకుల పాఠశాల ప్రవేశ పరీక్ష

ఎ.కొండూరు: మండలంలోని కృష్ణారావుపాలెం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలుర పాఠశాలలో విద్యార్థుల సీట్ల భర్తీకి ఈనెల 27న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని ప్రిన్సిపాల్ కె. సిద్ధయ్య మంగళవారం తెలిపారు. పాఠశాలలో ఆరో తరగతి నుంచి తొమ్మిదో తరగతి వరకు ఉన్న ఖాళీ సీట్లను భర్తీ చేస్తామని చెప్పారు. ఆరో తరగతిలో ఎస్సీ-6, బీసీ-2, ఓసీ-1, ఏడో తరగతిలో ఎస్టీ-2, బీసీ-1, ఎనిమిదో తరగతిలో బీసీ-2, ఓసీ-1, తొమ్మిదో తరగతిలో బీసీ-1 ఖాళీలు ఉన్నాయన్నారు. 27వ తేదీన ఉదయం 10 గంటలకు ప్రవేశ పరీక్ష జరుగుతుందని, మెరిట్, రిజర్వేషన్ ఆధారంగా ఖాళీ సీట్లను భర్తీ చేస్తామని తెలిపారు.

దివ్యాంగ బాలలను ఆదరించాలి




ముసునూరు: దివ్యాంగ బాలలకు అందరి ఆదరణ అవసరమని హెచ్‌ఎం లోకరాజు అన్నారు. సమగ్ర శిక్షా అభియాన్ మండల విభాగం ఆధ్వర్యంలో దివ్యాంగ బాలల తల్లిదండ్రులకు రమణక్కపేట మెయిన్ ప్రాథమిక పాఠశాల భవిత కేంద్రంలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. దివ్యాంగ బాలల సౌకర్యాలు, వసతులు, వారి పట్ల తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం ఫిజియో థెరపిస్ట్ ప్రశాంతి ఐదుగురు దివ్యాంగ బాలలకు ఫిజియోథెరపీ సేవలందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సురేష్‌బాబు, ఐఈఆర్ టీచర్లు ఎంవీ లక్ష్మీనారాయణరావు, జె. నాగమల్లేశ్వరి, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

180 మందికి నేత్ర వైద్య పరీక్షలు



ఇబ్రహీంపట్నం(మైలవరం): ఉచిత నేత్ర వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎన్టీటీపీఎస్ చీఫ్ ఇంజినీర్ శ్రీధర్ అన్నారు. ఎన్టీటీపీఎస్ ఎ. కాలనీ ఎస్‌వీసీటీ (కల్యాణ మండపం)లో మంగళవారం ప్లాంట్ ఉద్యోగులు, కార్మికుల ప్రయోజనార్థం ఆయాన్ ఐ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని మంగళవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా 180 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు, 16 మందికి ఉచితంగా కళ్లజోళ్లు అందజేశారు. కార్యక్రమంలో ప్లాంట్ అధికారులు ఎం. సుశీల, ఆర్. శ్రీనివాసరావు, ఆస్పత్రి గౌరవాధ్యక్షులు వావిలాల రజనీకాంతశర్మ తదితరులు పాల్గొన్నారు.

డ్రెయినేజీ పనులకు శ్రీకారం



ఎ.కొండూరు: మండల పరిధి కోడూరు గ్రామంలో సర్పంచ్ టి. సురేష్ ఆధ్వర్యంలో మంగళవారం డ్రెయినేజీ పనులకు శ్రీకారం చుట్టారు. గ్రామంలో ఎరుకుల సెంటర్ మట్టిగుంజ బజారుకు వెళ్లే రహదారిలో డ్రెయినేజీ నిర్మాణానికి జేసీబీతో మట్టిని తీసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ వర్షాకాలంలో ప్రజలు ఇబ్బందులకు గురికాకుండా మురుగునీరు పారే విధంగా డ్రెయినేజీలు నిర్మిస్తున్నామని చెప్పారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో అత్తునూరు వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంతా మా ఇష్టం !

- ఉనికి చాటుకునేందుకు టీడీపీ నేతల యత్నం
- గొల్లపూడి పంచాయతీ కార్యాలయంలో కొత్త శిలాఫలకాల ఏర్పాటుకు చర్యలు
- శిలాఫలకాలు కాదు.. అభివృద్ధిలో పోటీ పడాలంటున్న ప్రజలు

భవానీపురం(విజయవాడపశ్చిమ): విజయవాడ రూరల్ మండలం గొల్లపూడిలో తెలుగుదేశం పార్టీ నాయకులు ఉనికి చాటుకునేందుకు చేస్తున్న యత్నాలు ప్రజలను విస్తుగొలుపుతున్నాయి. గత ఐదేళ్లుగా వైఎస్సార్ సీపీ అధికారంలో ఉండటంతో కిమ్మనకుండా ఉన్న గ్రామ టీడీపీ నాయకులు ఇప్పుడు తమ పార్టీ అధికారంలోకి రావడంతో రెచ్చిపోతున్నారు. అధికారంలోకి వచ్చాం..ఇక్పై అంతా మా ఇష్టం అన్న రీతిలో వ్యవహరిస్తున్నారు.

మూడున్నర దశాబ్దాల కిందట ఏర్పాటు

సుమారు మూడున్నర దశాబ్దాల కిందట ఏర్పాటైన గొల్లపూడి గ్రామ పంచాయతీ కార్యాలయం సర్పంచ్, పాలకవర్గ సభ్యులుగా ఇప్పటి వరకు అనేకమంది పని చేశారు. అందులో 1983లో తెలుగు దేశం పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి గ్రామ పంచాయతీ సర్పంచ్, పాలకవర్గం సభ్యులుగా పని చేసినవారూ ఉన్నారు. మొన్నటి వరకు మైలవరం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యేగా ఉన్న వసంత కృష్ణప్రసాద్ 2024 ఎన్నికలకు ముందు టీడీపీలో చేరి 2024 ఎన్నికల్లో అదే నియోజకవర్గంలో పోటీ చేసి గెలుపొందడంతో గ్రామంలోని టీడీపీ నాయకులు చెలరేగిపోతున్నారు.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే ఆధునికీకరణ

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో 2022లో సుమారు రూ.50 లక్షల వ్యయంతో గొల్లపూడి గ్రామ పంచాయతీ కార్యాలయ భవనాన్ని ఆధునికీకరించి మొదటి అంతస్తు కూడా నిర్మించారు. గ్రౌండ్ ఫ్లోర్‌లో గ్రామ సచివాలయం-1 ఏర్పాటు చేశారు. వీటిని అప్పటి వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ ప్రారంభించారు. దానికి సంబంధించిన శిలాఫలకాలను కూడా ఏర్పాటు చేశారు. అందులో నాటి ఎంపీ కేశినేని శ్రీనివాస్ (నాని), ఎమ్మెల్సీ తలశిల రఘురామ్ పేర్లు ఉండటం టీడీపీ నాయకులకు కంటగింపుగా ఉంది. దీంతో 1995 నుంచి 2019 వరకు ఉన్న గ్రామ పంచాయతీ సర్పంచ్, పాలకవర్గ సభ్యుల (టీడీపీ) పేర్లను ఉటంకిస్తూ కొత్త శిలాఫలకాలను పంచాయతీ కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టారు. ఆయా శిలాఫలకాలు వెలుగు చూడటమే అందుకు నిదర్శనంగా కనబడుతోంది. గ్రామ పాలనలో తాము కూడా ఉన్నామని చెప్పుకుని తమ ఉనికిని చాటుకునేందుకే గ్రామ టీడీపీ నాయకులు ఆరాటపడుతున్నారని గ్రామ ప్రజలు వ్యాఖ్యానిస్తున్నారు. పంచాయతీ కార్యాలయం బయట ఎవరి శిలాఫలకాలు ఉంటే ఏముంది..అభివృద్ధిలో పోటీ పడాలిగానీ అని గ్రామ ప్రజలు అంటున్నారు. గత ప్రభుత్వం కంటే గ్రామానికి మరింత మేలు చేస్తే పది మంది చెప్పుకుంటారని, టీడీపీ నాయకులు అది గ్రహించాలని వ్యాఖ్యానించడం గమనార్హం.



గత ప్రభుత్వంలో ఆధునికీకరించి నిర్మించిన గొల్లపూడి గ్రామ పంచాయతీ కార్యాలయ భవనం



కార్యాలయ ద్వారం పక్కన గోడకు ప్రస్తుతం ఉన్న శిలాఫలకాలు



సచివాలయం-1 ప్రారంభోత్సవ శిలాఫలకం | త్వరలో ఏర్పాటు చేయనున్న కొత్త శిలాఫలకాలు

పాతవి తొలగించరు

పంచాయతీ కార్యాలయ అభివృద్ధికి సంబంధించి ఇప్పటి వరకు ఉన్న శిలాఫలకాలను తొలగించరు. గతంలో ఉన్న పాలక వర్గాల శిలాఫలకాలను అదనంగా ఏర్పాటు చేయనున్నారు.

స్వరూపరాణి,
గొల్లపూడి పంచాయతీ ఈఓ

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

పట్టణ సీఐ ఎంవీవీఎస్ఎన్‌మూర్తి

నూజివీడు: మత్తు పదార్థాలకు, మాదక ద్రవ్యాలకు విద్యార్థులు, యువత దూరంగా ఉండాలని, వాటికి అలవాటు పడితే బంగారు భవిష్యత్ దుర్భరమవుతుందని పట్టణ సీఐ ఎంవీవీఎస్ఎన్‌మూర్తి అన్నారు. నవజీవన్ బాలభవన్ ఆధ్వర్యంలో పట్టణంలో మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా మంగళవారం విద్యార్థులతో కలిసి నిర్వహించిన అవగాహన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. కుటుంబ విలువలు, శారీరక, మానసిక ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. మత్తు అనేది మనిషిని పతనం చేస్తుందని, మత్తు మహమ్మారి నుంచి బయట పడేందుకు డీ అడిక్షన్ సెంటర్లు ఉన్నాయని చెప్పారు. నార్కోటిక్ డ్రగ్స్ నివారణ చట్టం మాదక ద్రవ్యాల నేరాలను చాలా తీవ్రంగా చూస్తోందన్నారు. ఈ నేరాల్లో జరిమానా, శిక్షలు చాలా తీవ్రంగా ఉంటాయని వివరించారు. కార్యక్రమంలో పట్టణ ఎస్ఐ రామకృష్ణ, శారద జూనియర్, డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాళ్లు అప్పాజీ, రమేష్, నవజీవన్ బాలభవన్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు, పోలీసులు

మర్సకట్ల సేవలు ఎనలేనివి

తిరువూరు: అసంఘటిత కార్మికులు, వ్యవసాయ కార్మికుల సంక్షేమానికి సీపీఎం సీనియర్ నేత మర్సకట్ల ప్రభాకరరావు విశేష కృషి చేశారని ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు సానికొమ్ము నాగేశ్వరరెడ్డి అన్నారు. స్థానిక సుందరయ్య భవన్‌లో మంగళవారం ప్రభాకరరావు ప్రథమ వర్థంతి సభ జరిగింది. ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే వామపక్ష భావాలతో ఉద్యమాలు నిర్వహించిన ప్రభాకరరావు తాను నమ్మిన సిద్ధాంతం కోసం ఎన్నో కష్టనష్టాల కోర్చారన్నారు. తిరువూరు డివిజన్ పార్టీ కార్యదర్శిగా, వ్యవసాయ కార్మిక సంఘం, కుల వివక్ష పోరాట సమితి నేతగా పేదవర్గాల అభిమానాన్ని చూరగొన్న ప్రభాకరరావు లేని లోటు తీరనిదని చెప్పారు. నాయకులు పంతంగి శ్రీనివాసరావు, ఆకుల రవి, మాచిబోయిన లక్ష్మీనారాయణ, మేకల నాగేంద్రప్రసాద్ తదితరులు ప్రభాకరరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.



వర్థంతి సభలో మాట్లాడుతున్న నాగేశ్వరరెడ్డి

చొప్పరమెట్లలో తగ్గిన జ్వరాలు



శిబిరంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ మంజుల

ఆగిరిపల్లి: చొప్పరమెట్ల పంచాయతీ పరిధిలోని తాడేపల్లిలో జ్వర బాధితుల సంఖ్య తగ్గుముఖం పట్టిందని నగ్గూరు పీహెచ్‌సీ వైద్యులు మంజుల తెలిపారు. వారం రోజుల నుంచి గ్రామస్తులు జ్వరాలతో ఇబ్బంది పడ్డారన్నారు. సోమ, మంగళవారం జ్వరాల కేసులు నమోదు కాలేదని ఆమె తెలిపారు. ప్రతి రోజూ ఆశ వర్కర్లు, ఏఎన్‌ఎంలు ప్రతి ఇంటికీ వెళ్లి జ్వరాలపై సర్వే నిర్వహిస్తున్నారని, గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో అనారోగ్యంగా ఉన్నవారికి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామని చెప్పారు. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో నిరంతరం పారిశుద్ధ్య పనులను చేపడుతున్నామని పంచాయతీ కార్యదర్శి మీర్జావలి తెలిపారు.

డ్రగ్ ఫ్రీ సూపర్ హీరో సెల్ఫీ కాంటెస్ట్

కృష్ణలంక(విజయవాడతూర్పు): మాదకద్రవ్యాల వినియోగం వలన కలిగే అనర్థాలపై విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలని పొట్టి శ్రీరాములు ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఇ.కోటేశ్వరరావు అన్నారు. కృష్ణలంకలోని పొట్టి శ్రీరాములు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నవజీవన్ బాలభవన్ ఆధ్వర్యంలో మంగళవారం అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక వారోత్సవాలలో భాగంగా విద్యార్థులకు 'డ్రగ్ ఫ్రీ సూపర్ హీరో' సెల్ఫీ కాంటెస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ విలువలతో ఉండాలని, కుటుంబ విలువలు, శారీరక, మానసిక ఆరోగ్యాల ప్రాధాన్యాన్ని దృష్టిలో ఉంచుకొని అడుగులు వేస్తే అద్భుతమైన ఫలితాలు వస్తాయన్నారు. మాదకద్రవ్యాలు జీవితాన్ని ఎంతగా ప్రభావితం చేస్తాయో, ఎటువంటి పతనావస్థకి చేరుస్తాయో ముందుగానే తెలుసుకొని సక్రమమైన మార్గంలో జీవించాలన్నారు. అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన నవజీవన్ బాలభవన్ వారికి కృతజ్ఞతలు తెలిపారు. నవజీవన్ బాలభవన్ జోనల్ కో- ఆర్డినేటర్ ఓ.నజ్మా మాట్లాడుతూ వారోత్సవాలలో భాగంగా ఈ నెల 24 నుంచి 30వ తేదీ వరకు విజయవాడ, పరిసర ప్రాంతాలలో డ్రగ్ ఫ్రీ సూపర్ హీరో సెల్ఫీ కాంటెస్ట్ నిర్వహిస్తామన్నారు. కాంటెస్ట్‌లో గెలుపొందిన విజేతకు రూ.5 వేల నగదు బహుమతి అందజేస్తామన్నారు. మత్తు పదార్థాల నిర్మూలనకు అంతఃకరణ శుద్ధితో పాటుపడతామని, విజయవాడ సిటీని డ్రగ్ ఫ్రీ సిటీగా ఉంచటానికి సహకరిస్తామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కళాశాల పీడీ వి.రవికాంత, అధ్యాపకులు గురుదేవి, నవజీవన్ బాలభవన్ జోనల్ కో-ఆర్డినేటర్ జ్యోతి చంద్రిక తదితరులు పాల్గొన్నారు.




ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

విద్యార్థులకు కిట్స్ పంపిణీ

ఆంజనేయపురం(తిరువూరురూరల్): ఆంజనేయపురం ఎంపీపీ పాఠశాల విద్యార్థులకు స్టూడెంట్ కిట్స్‌ను మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచి మామిడి కుటుంబరావు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాల్సిన ఆవశ్యకతను తల్లిదండ్రులకు వివరించారు. ఆధునిక సదుపాయాలతో, ఉత్తమ బోధనతో ప్రభుత్వ పాఠశాలలు నిర్వహిస్తున్నందున పిల్లలను ప్రైవేటు పాఠశాలలకు పంపవద్దని సూచించారు.

వేంకటాచలస్వామికి సహస్ర దీపాలంకరణ



తిరువూరు: స్థానిక పాత తిరువూరులోని వేంకటాచల స్వామి ఆలయంలో మంగళవారం శ్రవణ నక్షత్రం సందర్భంగా సహస్ర దీపాలంకరణ సేవ నిర్వహించారు. ఆలయ అర్చకులు వేణుగోపాలాచార్యులు స్వామివారికి విశేషార్చనలు జరిపారు. అనంతరం ఆర్యవైశ్య ప్రముఖులు దోసపాటి కృష్ణప్రదీప్ కుటుంబ సభ్యులు సహస్ర దీపాలంకరణ సేవలో పాల్గొన్నారు. వైష్ణవ గోష్ఠి సభ్యులు సంకీర్తన చేశారు.

విద్యార్థులకు అందని యూనిఫాం

చాట్రాయి: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులకు ప్రభుత్వం అందించే యూనిఫాం నేటికీ అందలేదు. మండలంలోని 18 గ్రామ పంచాయతీల్లో 48 ప్రాథమిక, ఏడు ప్రాథమికోన్నత పాఠశాలలు, ఏడు జిల్లా పరిషత్ హైస్కూళ్లు ఉన్నాయి. వీటిలో సుమారు 3,200 మంది విద్యార్థులు చదువుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో ప్రతి సంవత్సరం పాఠశాలలు ప్రారంభం కాగానే విద్యార్థులకు పాఠ్య, నోట్ పుస్తకాలు, దుస్తులు, బూట్లు, సాక్సులు, బెల్టులు, బ్యాగ్‌లు పంపిణీ చేసేవారు. బడులు ప్రారంభించి 12 రోజులు అవుతున్నా పలుచోట్ల విద్యార్థులకు స్టూడెంట్ కిట్లు పంపిణీ చేయలేదని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీటిలో పాఠ్య, నోట్ పుస్తకాలు మాత్రమే పంపిణీ చేశారు. ఇప్పటికైనా విద్యార్థులకు విద్యా సామగ్రిని పూర్తి స్థాయిలో అందించాలని చిన్నారుల తల్లిదండ్రులు కోరుతున్నారు. దుస్తులు స్టాక్ పాయింట్‌కు రాగానే విద్యార్థులకు పంపిణీ చేస్తామని చాట్రాయి ఎంఈఓ వీఎస్‌వీ బ్రహ్మచారి తెలిపారు.

పాఠశాలల్లో సమస్యలు పరిష్కరించాలి

పీడీఎస్‌యూ వినతి

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పూర్తి స్థాయిలో పాఠ్య పుస్తకాలు అందించడంతో పాటు పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) జిల్లా అధ్యక్షుడు ఐ.రాజేష్ ప్రభుత్వాన్ని కోరారు. నగరంలోని డీఈఓ కార్యాలయంలో సహాయ సంచాలకురాలు జి.రాజేశ్వరికి మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా సంవత్సరం మొదలైనా ప్రభుత్వ పాఠశాలల్లో చేరిన విద్యార్థులకు ఇప్పటి వరకు పాఠ్య పుస్తకాలు పూర్తిగా అందించలేదని పేర్కొన్నారు. 6,7 తరగతులు చదువుతున్న విద్యార్థులకు కొన్ని పాఠ్య పుస్తకాలు మాత్రమే అందించారని, దీనివల్ల పాఠాలు అర్థం కాక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. జిల్లా పరిషత్, కార్పొరేషన్, మున్సిపల్ పాఠశాలల విద్యార్థులందరికీ తక్షణమే పూర్తి స్థాయిలో పాఠ్య పుస్తకాలు అందివ్వాలని కోరారు. పాఠశాలల్లో మరుగుదొడ్ల సౌకర్యాన్ని మరింత మెరుగుపరచాలని, ఖాళీగా వున్న ఉపాధ్యాయ పోస్టులను ప్రభుత్వం వెంటనే భర్తీ చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలు వసూలు చేస్తున్న ఫీజులపై కూడా విద్యాశాఖాధికారుల నియంత్రణ ఉండాలని, పాఠ్య, నోట్ పుస్తకాలు, యూనిఫాం, టర్మ్ ఫీజుల పేరుతో లక్షలాది రూపాయలను తల్లిదండ్రుల నుంచి వసూలు చేస్తున్నాయని, వీటిని నియంత్రించాలని కోరారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు ఎల్.శివ, బి.గణేష్, ఎస్.వెంకట్ తదితరులు పాల్గొన్నారు.




వినతిపత్రం అందజేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

బాలల హక్కుల రక్షణ అందరి బాధ్యత



తిరువూరు: విలువైన బాల్యాన్ని చిదిమేసి చదువుకునే వయసులో పనులకు పంపే విష సంస్కృతిని రూపుమాపేందుకు, బాలల హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తిరువూరు ఐడియాస్ సేవా సంస్థ డైరెక్టర్ అవ్వారి శౌరి అన్నారు. స్థానిక సిద్దార్థ స్కూల్ ఆవరణలో మంగళవారం బాలల హక్కులపై అవగాహన కల్పిస్తూ ప్రచార పోస్టర్లను విడుదల చేశారు. బాల బాలికలకు ఉన్న హక్కులను తెలియజేస్తూ, వాటి పరిరక్షణకు చేయాల్సిన కృషిని వివరించారు. బడి ఈడు పిల్లలను పనులకు పంపవద్దని, సాధ్యమైనంత వరకు పిల్లలను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దేందుకు తల్లిదండ్రులు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు అందజేత



ఆగిరిపల్లి: తోటపల్లి ప్రాథమిక ఉన్నత పాఠశాలలో గ్రామానికి చెందిన ప్రసాద్ (బాబు) రూ.15 వేల విలువైన పుస్తకాలు, పలకలు, పెన్నులు తదితర విద్యా సామగ్రిని విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఆరేపల్లి పద్మ మాట్లాడుతూ దాతలు, ప్రభుత్వ ప్రోత్సాహాన్ని సద్వినియోగం చేసుకుని విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు తాడిశెట్టి శోభన్ బాబు, ఆరేపల్లి శ్రీనివాసరావు, పలువురు ఉపాధ్యాయులు పాల్గొని దాత ప్రసాద్‌ను అభినందించారు.

మూఢ నమ్మకాల నియంత్రణ చట్టం తేవాలి

తిరువూరు: ఆధునిక కాలంలో సైతం మూఢ నమ్మకాలకు అమాయక ప్రజలు బలవుతున్నారని, వీటి నియంత్రణకు ప్రభుత్వాలు చట్టాలు తీసుకురావాలని జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్. గంగాధర్ అన్నారు. స్థానిక సుందరయ్య భవన్‌లో మంగళవారం సమాజంపై మూఢ నమ్మకాల ప్రభావం అంశంపై జేవీవీ ఆధ్వర్యంలో అవగాహన సమావేశం నిర్వహించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించేందుకు, మూఢ నమ్మకాల నిరోధానికి ప్రత్యేక చట్టాన్ని తీసుకురావలసిన అవసరం ఉందని చెప్పారు. జిల్లా ఉపాధ్యక్షుడు హరికృష్ణ, నాయకులు రాంప్రదీప్, సుదర్శన్, సుధాకర్, సైదులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



కంచికచర్ల అంబేడ్కర్ నగర్‌లో బ్లీచింగ్, సున్నం చల్లిస్తున్న సర్పంచి సునీత



గండేపల్లిలో రోడ్డుపై ఉన్న చెత్తాచెదారాన్ని జేసీబీతో తొలగిస్తున్న సర్పంచి రవికుమార్

కంచికచర్ల : ప్రజలు వ్యాధుల బారిన పడకుండా పట్టణంలో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని సర్పంచి వేల్పుల సునీత అన్నారు. స్థానిక పెద్దబజార్, హనుమాన్‌పేట, సంజీవనగర్, అంబేడ్కర్ నగర్‌లలో మంగళవారం శానిటేషన్ పనులు చేపట్టారు. ఈ మేరకు సర్పంచి మాట్లాడుతూ సీజనల్‌గా వచ్చే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరారు. పలు వీధుల్లో రోడ్ల వెంబడి, మురుగుకాల్వల్లో బ్లీచింగ్, సున్నం చల్లించారు. పంచాయతీ కార్యదర్శి బ్రహ్మం, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

గండేపల్లిలో ప్రచారం..

సీజనల్‌గా వచ్చే వ్యాధుల నివారణకు ప్రజలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సర్పంచి బొక్కా రవి కుమార్ అన్నారు. గండేపల్లిలో సీఎస్ఐ దేవాలయం, వెంకటేశ్వరస్వామి ఆలయం మైకుల ద్వారా మంగళవారం ప్రచారం చేశారు. మాంసం విక్రయాలు జరపరాదని, కాచి చల్లార్చిన నీటిని తాగాలని ప్రచారం చేశారు. మురుగునీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. ఆర్‌సీఎం చర్చి వెనుక రోడ్డులో అపరిశుభ్రంగా ఉన్న చెత్తా చెదారాన్ని గత మూడు రోజుల నుంచి జేసీబీ సాయంతో తొలగించారు. అనంతరం బ్లీచింగ్, సున్నం చల్లించారు. పంచాయతీ కార్యదర్శి జిల్లేపల్లి రత్నాకర్ పాల్గొన్నారు.